కాంగ్రెస్‌లోకి గొట్టిముక్కల పద్మారావు.!

పార్టీలోకి రావాలని ఆహ్వానించిన పట్నం మహేందర్‌రెడ్డి



గొట్టిముక్కల పద్మారావును ఆయన నివాసంలో కలిసిన పట్నం మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు

కూకట్‌పల్లి: సీనియర్ నాయకుడు గొట్టిముక్కల పద్మారావును మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. సోమవారం గొట్టిముక్కల పద్మారావు నివాసానికి వచ్చిన మహేందర్‌రెడ్డి పద్మారావును కాంగ్రెస్ పార్టీలోకి రావల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఇరువురు నేతలు చర్చలు జరిపారు. 2014లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన గొట్టిముక్కల పద్మారావు గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఆశించిభంగపడ్డారు. అయితే సీఎం రేవంత్‌రెడ్డి సూచనల మేరకు గొట్టిముక్కల పద్మారావును సోమవారం పట్నం మహేందర్‌రెడ్డి కలిశారు. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలోనే కాంగ్రెస్ పార్టీలో చేరతారని సమాచారం. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొప్పిశెట్టి దినేష్‌కుమార్, శేరి సతీష్ రెడ్డి, రాంబాబు, జగన్, శివ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం.. మహాదానం



అన్నదాన వితరణలో పాల్గొన్న లక్ష్మణ్ గుప్తా తదితరులు

మోతీనగర్: జై ఆర్యవైశ్య సేవా సమితి ఆధ్వర్యంలో గాయత్రినగర్‌లో అమావాస్య అన్నదాన వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి లక్ష్మణ్‌గుప్తా మాట్లాడుతూ.. అన్నదానం మహాదానమని అన్నారు. ప్రతి నెలా అమావాస్య రోజు మోతీనగర్ ప్రాంతంలోని పలు బస్తీ, కాలనీల్లో ఏదో ఒక చోట అమావాస్య అన్నదాన కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు.

మాధవీనగర్ నూతన కమిటీ ఏకగ్రీవం

భాగ్యనగర్‌కాలనీ: మాధవినగర్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు నూతన కమిటీని కాలనీవాసులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొత్త కమిటీ కోసం సోమవారం జరిగిన సమావేశంలో కమిటీ అధ్యక్షుడిగా ఎం.మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా మురళీధర్ రెడ్డి, ఎం. రామ్‌మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా వై. రఘు కుమార్, జాయింట్ సెక్రటరీలుగా రమణమూర్తి, హెచ్.రామారావు, సి.చెన్నారెడ్డి, కోశాధికారులుగా ఎం.బ్రహ్మారెడ్డి, జె. సత్యనారాయణ, పి. వహిధర్‌రెడ్డి, కమిటీ కార్యనిర్వాహక సభ్యులుగా జయపాల్ రెడ్డి, కె. బాలాజీ, సీవీఆర్‌జీ విశ్వేశ్వరరావు, వి.కృష్ణ, ప్రసాద్ రూపిచర్ల, కమలాకర్‌రెడ్డి, జి.శ్రీనివాస్‌రెడ్డి, టి.వేణుబాబు, ఎస్.మాధురిరెడ్డి, ఎ.చంద్రశేఖర్, ఎం.మోహన్‌రావు, కె.వాసును ఎన్నికయ్యారు. కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామని నూతన సభ్యులు తెలిపారు.

అరుదైన శస్త్ర చికిత్స

మహిళ కడుపులోంచి 10 కేజీల క్యాన్సర్ గడ్డ తొలగింపు

హఫీజ్‌పేట్: ఓ మహిళ కడుపులో నుంచి 10 కేజీల క్యాన్సర్ గడ్డను తొలగించారు మదీనాగూడలోని అర్చన ఆసుపత్రి వైద్యులు. సోమవారం విలేకరుల సమావేశంలో వైద్యులు మాట్లాడుతూ నగరానికి చెందిన రేష్మ అనే మహిళ గత సంవత్సరం నుంచి కడుపు నొప్పి, ఉబ్బరంతో బాధపడుతుంది. దీంతో తీవ్ర నొప్పి రావడంతో వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను మదీనాగూడలోని అర్చన ఆసుపత్రికి తీసుకువచ్చారు. వైద్యులు పరీక్షించగా రక్తస్రావం తీవ్రంగా ఉండడాన్ని గమనించారు. వెంటనే ఆమెకు సీటీ స్కాన్ చేయగా కడుపులో 10 కేజీల క్యాన్సర్ గడ్డ ఉన్నట్లు తేలింది. దీంతో డాక్టర్లు శస్త్ర చికిత్స ద్వారా గడ్డను తొలగించారు. ఆమె ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు.

చిరుధాన్యాలతో మంచి ఆరోగ్యం

పటాన్‌చెరు: చిరుధాన్యాలతో (మిల్లెట్లు) మంచి ఆరోగ్యం కలుగుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లోని ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో 'వ్యవసాయ-ఆహార పర్యావరణ వ్యవస్థలో చిరుధాన్యాలు, తినదగిన అడవి జాతులను ప్రధాన స్రవంతిలోకి తేవడం' అనే అంశంపై సోమవారం వర్క్ షాప్ నిర్వహించారు. గీతం విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ హెల్త్ అండ్ ఇన్నోవేషన్ (సీహెచ్‌ఎడబ్ల్యూఐ), బ్రిటన్ లోని, కోవెంట్రీ విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ అగ్రోకాలజీ, వాటర్ అండ్ రెసిలెన్స్ సంయుక్త సహకారంతో నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో పలు రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నా రు. ముఖ్యంగా చిరుధాన్యాలు, ఇతర వినియోగించని ఆహారాలపై వారు ప్రత్యేక దృష్టి సారించారు. వాటి వినియోగానికి సంబంధించిన సవాళ్లన్ని చర్చించారు. పోషకాహార సమస్యలను పరిష్కరించడానికి తమ పరిశోధన సహకారం అందించడంతో పాటు చిరుధాన్యాల సేద్యంపై వాతావరణ మార్పుల ప్రభావాన్ని వివరించారు.

ఘనంగా
విజేత సూపర్‌మార్కెట్ వార్షికోత్సవం

కూకట్‌పల్లి: నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రధాన్ కన్వెన్షన్‌లో విజేత సూపర్ మార్కెట్ 25వ వార్షికోత్సవ సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రాహ్మణి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీలు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా బుల్లితెర నటి సుమ వ్యవహరించారు. ఈ సందర్భంగా నారా బ్రాహ్మణి మాట్లాడుతూ నాణ్యమైన ఉత్పత్తులు అందించటం ద్వారా వినియోగదారుల మన్ననలు పొందిందని తెలిపారు. విజేత సూపర్‌మార్కెట్ మేనేజింగ్ డైరెక్టర్ జగన్‌మోహన్ రావు మాట్లాడుతూ వచ్చే 10 సంవత్సరాల్లో స్టోర్ల సంఖ్యను 200కు పైగా విస్తరించి వేల కోట్ల టర్నోవర్ లక్ష్యంగా పెట్టుకొని వేలాదిమందికి ఉపాధి కల్పించటమే ధ్యేయంగా ముందుకెళుతున్నామన్నారు. ఈ సంబరాల్లో 25 సంవత్సరాలుగా పని చేస్తున్న విజేత ఉద్యోగులకు పురస్కారాలు అందజేశారు. లక్కీ డ్రా విజేతలకు మొదటి బహుమతిగా టాటా నెక్సాన్ కారు, రెండో బహుమతిగా 5 రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనాలు, మూడో బహుమతిగా 25 చేతక్ కర్బన్ ఎలక్ట్రికల్ స్కూటర్లు, బోనస్ బహుమతులుగా 111 ఎలక్ట్రికల్ రైస్ కుక్కర్లను అందజేశారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సందీప్, సిద్ధార్థ, కృష్ణవేణి, ఉద్యోగులు పాల్గొన్నారు.



ఇంప్యూర్ వాటర్

ప్యూరిఫై అంటారు.. తాగితే అడ్డం పడతారు.!

- శుద్ధ జలాల మాటున నీటిలో గరళం
- అనుమతులేని వాటర్ ప్లాంట్లే అధికం
- నిబంధనలు పాటించకుండా నీటి వ్యాపారం
- ఐఎస్‌ఐ మార్కు, లైసెన్సు లేని వాటర్ ఫిల్టర్లు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: వేసవి నేపథ్యంలో తాగునీటికి ఇబ్బందులు ఏర్పడుతుండగా.. ఇదే అదనుగా శుద్ధ జలాల పేరుతో కొందరు నీటి వ్యాపారం చేస్తున్నారు. నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో విచ్చలవిడిగా ప్లాంట్లు ఏర్పాటైనా.. ఒక్క చోటా కనీస నిబంధనలు పాటించడం లేదు. జిల్లాలో 700 పైగా శుద్ధ జలాల ప్లాంట్లు ఉండగా, ఇందులో అన్ని అనుమతులతో కొనసాగుతున్న ప్లాంట్లు దాదాపు 250 వరకు మాత్రమే ఉన్నట్లు భూగర్భ జల వనరుల శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలోనే నీటిని నిబంధనలకు అనుగుణంగా శుద్ధి చేయకుండానే విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పెరిగిన నీటి వ్యాపారం..

గతంలో నగర శివారుల్లో వేళ్ల మీద లెక్క పెట్టే సంఖ్యలో ఉండే తాగునీటి శుద్ధి చేసే ప్లాంట్లు నేడు పురపాలక సంఘాలతో సహా గ్రామ పంచాయతీలు, జీహెచ్‌ఎంసీ పరిధిలోని బస్తీలు, డివిజన్లలోని ప్రధాన కూడళ్లలో ప్రతిచోటా వెలిశాయి. వేసవి కాలం, పెళ్లిళ్లు ఇతర శుభ కార్యాలయాలు, హోటళ్లు, బార్లు, వైన్‌షాపులు, ఇతర వ్యాపార సముదాయాలను కలుపుకుంటే వేల సంఖ్యలో క్యాన్ల విక్రయాలు జరుగుతున్నాయి. అలాగే, అపార్టుమెంట్లు, కాలనీలు, బస్తీల్లో కూడా క్యాన్ల విక్రయాలు జోరు అధికం



గా ఉంది. ప్లాంటు దగ్గరికే వెళ్లి తీసుకుంటే ఒక్కో క్యానుకు రూ.10 తీసుకుంటున్నారు. ఇళ్లు, వ్యాపార వాణిజ్య కేంద్రాలకు క్యాన్లు సరఫరా చేస్తే దూరాన్ని బట్టి ఒక్కో క్యానుకు రూ.15 నుంచి రూ.20 తీసుకుంటున్నారు.

నిబంధనలు ఇవి..

వాటర్ ప్లాంటు ఏర్పాటుకు బీఎస్‌ఐ అనుమతి ఉండాలి. ప్రతి సంవత్సరం రెన్యువల్ చేసుకోవాలి. ప్లాంటులో విశాలమైన హాలు ఉండాలి. వెలుతురు, గాలి ఉండాలి. టైల్స్, గ్రానైట్ గచ్చు ఉండాలి. స్టీల్, హెచ్‌డీపీ పైపులైన్లు ఏర్పాటు చేసుకోవాలి. ఐఎస్‌ఐ మార్కు కలిగిన ఫిల్టర్ యంత్రాలు వాడాలి. నీటి ట్యాంకులు, ఇతర సామగ్రి, నాణ్యమైనవి వాడాలి. పురపాలక సంఘం లేదా గ్రామ పంచాయతీ నుంచి ట్రేడ్ లైసెన్సు పొందాల్సి ఉంటుంది.

నియంత్రణ లేక..

మిషన్ భగీరథ పథకం రానప్పుడు ఎక్కడైతే తాగడానికి పనికిరాని నీరుందని సమాచారం వస్తే అక్కడ నీటి పరీక్ష జరిపి ఆర్వో ప్లాంట్లకు అనుమతి ఇచ్చేవారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితితో పాటు నియంత్రణ లేకపోవడంతో ఇదే అదునుగా భావిస్తున్న వ్యాపారులు ఇష్టమొచ్చిన రీతిలో ప్లాంట్లను విస్తరిస్తున్నారు. ఇప్పటికైనా నిబంధనలకు విరుద్ధంగా వెలుస్తున్న ప్యూరిఫై వాటర్ ప్లాంట్ల నియంత్రణపై జిల్లా అధికార యంత్రాంగం దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు పేర్కొంటున్నారు.

సునీతామహేందర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి



గాయత్రినగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో రైనిష్‌రెడ్డి, పల్లపు వేణు

మోతీనగర్: లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి నుంచి కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సునీత తనయుడు రైనిష్‌రెడ్డి కోరారు. సోమవారం అల్లాపూర్ డివిజన్ అధ్యక్షుడు మహమ్మద్ మైనుద్దీన్ అధ్యక్షతన అల్లాపూర్ డివిజన్ యూత్ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పల్లపు వేణు మాట్లాడుతూ.... అసెంబ్లీ ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు అహర్నిశలు పార్టీ విజయానికి కృషి చేసినా తగిన గుర్తింపు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. యూత్ కాంగ్రెస్ కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇవ్వాలని కోరారు. అప్పుడే కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి మరింత ఉత్సాహంగా కార్యకర్తలు పని చేస్తారన్నారు. ఈసారి ఎన్నికల్లో కూడా ఎంపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. అంతేకాకుండా నామినేటెడ్ పదవుల్లో, పార్టీ పదవుల్లో యువతకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేముల సత్యం, సి.సుంకన్న, పొన్నాల రాజశేఖర్‌రెడ్డి, మస్తాన్‌రెడ్డి, కనకయ్య ముదిరాజ్, నరసింహయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఉగాది వేడుకలు



శ్రీసాయి విద్యానికేతన్, కిడ్డీ మౌంట్ లిటేర పాఠశాలల్లో ఉగాది వేడుకలు



మూసాపేట: శ్రీహరినగర్‌లోని కిడ్డీ మౌంట్ లిటేర స్కూల్, ప్రగతినగర్‌లోని శ్రీసాయి విద్యానికేతన్‌లో సోమవారం ఉగాది పండుగను వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని ఉపాధ్యాయులు చెప్పినట్లు ఉగాది పచ్చడి తయారు చేశారు. ఈ సందర్భంగా ఉగాది పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. పచ్చడిలోని షడ్రుచుల లాగా జీవితంలో లాభం, సంతోషం, కష్టం, నష్టం అంటూ ఉంటాయని వాటన్నిటినీ ఎదుర్కొని ముందుకు వెళ్లాలని తెలిపారు.

అక్రమ నీటి వ్యాపారాన్ని అరికట్టాలి



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న బస్తీ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి

ఆల్విన్‌కాలనీ: పాపిరెడ్డినగర్‌లో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని అక్రమ నీటి వ్యాపారాన్ని అరికట్టాలని సోమవారం పాపిరెడ్డినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి స్థానికులతో కలిసి నిరసన తెలిపారు. అదే విధంగా సోమవారం భూగర్భ జలాలను కాపాడాలని వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, బస్తీవాసులతో కలిసి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు భగవంతరెడ్డి, నర్సింలు ముదిరాజ్, రామకృష్ణారెడ్డి, అనంతరాములు, కేవీ రాజు మోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ధర్మారావు, కన్నారావు, వనం ఆంజనేయులు, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



ఆల్విన్‌కాలనీ: తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరగారి ప్రీతంను సోమవారం టీపీసీసీ రాష్ట్ర నాయకులు చిరుమర్తి రాజు మాదిగ, రాష్ట్ర యువజన విభాగం నాయకులు నరేంద్రలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఓటరు నమోదుపై అవగాహన

శేరిలింగంపల్లి: నల్లగండ్ల కూరగాయల మార్కెట్‌లో సోమవారం ఓటరు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరు ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసర్ నాగమల్లేశ్వరి, లైసెన్స్ ఆఫీసర్ గోపాల్‌రావు, సీఓ శ్రీకాంత్, శానిటేషన్ సిబ్బంది, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు ఖాజాపాష, రాంచందర్ పాల్గొన్నారు.

వర్షాకాలం లోపు నాలా విస్తరణ పనులు పూర్తి చేయాలి



నాలా విస్తరణ పనులను పరిశీలిస్తున్న ఇంజినీర్ ఇన్ చీఫ్ మహమ్మద్ జైనుద్దీన్

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ వి. రామారావునగర్ నుంచి మూసాపేట డివిజన్ అవంతినగర్ తోట వరకు ఇళ్ల మధ్య ఉన్న ఓపెన్ నాలా విస్తరణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. ఫిర్యాదులు అందుకున్న జీహెచ్‌ఎంసీ ఇంజినీర్ ఇన్ చీఫ్ మహమ్మద్ జైనుద్దీన్ పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నాలా విస్తరణ పై కప్పు కోసం వి. రామారావునగర్‌లో అదనంగా నిధులు కావాలని ప్రతిపాదించటంతో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. వర్షాకాలం ప్రారంభమయ్యేలోపు పనులు పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈ చిన్నారెడ్డి, ఈఈలు సత్యనారాయణ, గోవర్ధన్‌గౌడ్, డీఈలు ఆనంద్, శ్రీదేవి, ఏఈలు రంజిత్, అనురాగ్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు వినాయక రావు, బలరాం నాయక్‌లు ఉన్నారు.

కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు



పూజలో పాల్గొన్న మక్కాల సత్యనారాయణ, శ్రీగణేష్, బల్వంత్‌రెడ్డి, మక్కాల నర్సింగ్‌రావు



భక్తులకు అన్నదానం చేస్తున్న మక్కాల సత్యనారాయణ, శ్రీగణేష్

ఓల్డ్‌బోయిన్‌పల్లి: అమావాస్యను పురస్కరించుకుని బోయిన్‌పల్లి రిటైల్ కూరగాయల మార్కెట్‌లోని కనకదుర్గమ్మ ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఆవరణలో మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కంటోన్మెంట్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీగణేష్, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ బల్వంత్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. మార్కెట్ చైర్మన్ మక్కాల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు మక్కాల నర్సింగ్ రావు వారికి శాలువాతో సత్కరించి ప్రసాదం అందజేశారు. ఈ పూజల్లో రాపోలు వెంకటేష్, వైస్ చైర్మన్ రమేష్, ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల నర్సింగ్, కార్యదర్శి మక్కాల నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

'ఉగాది అంటే యుగానికి ఆది'

వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో కవి సమ్మేళనం

హఫీజ్‌పేట్: చందానగర్‌లోని విశాఖ శ్రీ శారదాపీఠ పాలిత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో సోమవారం ఆర్కిటెక్ట్ యెండూరి సురేష్ బాబు సౌజన్యంతో, పాలకమండలి సహకారంతో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనాన్ని ఆలయ ప్రధాన అర్చకులు సుదర్శన సత్యసాయి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హెచ్‌సీయూ ఆచార్య వంగర త్రివేణి, ఆచార్య బాశెట్టి లత, చిత్రకవితా సామ్రాట్ చింతా రామకృష్ణారావు, అవధాని ములుగు అంజయ్య, కటకం వెంకటరామశర్మలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ సంప్రదాయం ప్రకారం ఉగాది అంటే యుగానికి ఆది అని, నక్షత్రానికి ఆది అన్నారు. ఉగాదిని మనం చైత్ర శుక్ల పాడ్యమి రోజున చేసుకుంటామన్నారు. ఋతువులన్నింటిలో చైత్రం శ్రేష్టమైందన్నారు. మన సంస్కృతాంధ్ర కావ్యాలెన్నింటిలోనో వసంత ఋతు వర్ణనలు ఉన్నాయన్నారు. ఉగాది పచ్చడి, పంచాంగం ప్రాశస్త్యాన్ని వివరించారు. అనంతరం 60 మంది కవులను సత్కరించారు. హాస్య బ్రహ్మ శంకర నారాయణ, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్, ఆలయ పాలక కమిటీ సభ్యులు, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు నండూరి వెంకటేశ్వర రావు, విజయలక్ష్మి, జనార్దన్, నల్ల గొర్ల శ్రీనివాసరావు, జీవీ రావు, జిల్ మల్లేష్, ఉమా చంద్రశేఖర్, శివరామకృష్ణ పాల్గొన్నారు.

పండగలను కులమతాలకు అతీతంగా చేసుకోవాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మోతీనగర్: కూకట్‌పల్లి నియోజకవర్గం అల్లాపూర్ డివిజన్ పరిధిలోని కేజీఎస్ నగర్, ఎస్‌డీ ఫంక్షన్‌హాల్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సబిహా బేగం, ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి సతీమణి రజిని, కూతురు మౌనిక, మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్ ముఖ్య అతితులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రంజాన్ మాసం చాలా పవిత్రమైనదని అన్నారు. ముస్లింల ఇఫ్తార్‌లో ఇతర మతస్తులు పాల్గొనడం మన దేశ గొప్పతనమని అన్నారు. ఇలాగే అన్ని పండగలను కులమతాలకు అతీతంగా కలసిమెలసి చేసుకోవాలన్నారు.

ఆల్విన్‌కాలనీ ఈద్గా మైదానంలో..



ఆల్విన్‌కాలనీ: రంజాన్ ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలకు ఆల్విన్‌కాలనీ ఈద్గా మైదానంలో కాంగ్రెస్ నాయకుడు అనిల్‌రెడ్డి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి తనయుడు గడ్డం ఆర్యన్‌రెడ్డి, అల్లుడు రాజేష్‌రెడ్డి, కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్, నాయకుడు సిద్ధార్థరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలకు ఖజూర్ తినిపించారు.





ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సబిహా బేగం